పార్టీ గుర్తులను మూసేసిన అధికారులు

కొల్లాపూర్ పట్టణంలో పార్టీ జెండాపై గుర్తును మూసిఉంచిన దృశ్యం

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్థానిక అధికారులు స్పందించారు. పట్టణంలోని పోస్టాఫీస్ ఎదుట ప్రధాన రహదారి డివైడర్ మీద ఏర్పాటు చేసిన బీజేపీ దిమ్మె రాడ్‌పై ఉన్న కమలం గుర్తును మంగళవారం గోనె సంచితో కప్పేశారు. కాగా సమీపంలో మరో జాతీయ పార్టీ జెండా దిమ్మెపై ఉన్న హస్తం గుర్తును మాత్రం సదరు అధికారులు మూసివేయలేదు. అలాగే కొల్లాపూర్ – నాగర్‌కర్నూల్ మధ్య జాతీయ రహదారి కల్వర్టు గోడలమీ ద రాసిన ఎన్నికల రాతలను తుడిచివేయలేదు. స్థానిక అధికారులు ఎన్నికల కోడ్‌ను చిత్తశుద్ధితో అమలు చేయకపోవడంపై పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కొల్లాపూర్, మార్చి 12: పట్టణంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసి వివిధ పార్టీల జెండాలపై గుర్తులను మంగళవారం అధికారులు మూసి వేశారు. కోడ్ కూసినా పట్టదా అనే శీర్షికన ఈ నెల 10 వతేదీన

ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

అచ్చంపేటటౌన్, మార్చి 12: నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల రాజారెడ్డి, శేఖర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం అచ్చంపేట పట్టణంలోని వనవాసీ సేవాప్రకల్ప ఆవాసంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రకటించి నూతన పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయునులకు కనీస వేతనాలు అందజేసి సకాలంలో వేతనాలు చెల్లించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు శ్రీనివాసులు, పెంట్యానాయక్, జిల్లా నాయకులు మురళీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, యువ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ

విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ ప్రతినిధులు

అచ్చంపేటటౌన్, మార్చి 12: పట్టణంలోని వనవాసీ సేవా ప్రకల్ప బాలుర ఆవాసం విద్యార్థులకు మంగళవారం క్లాస్‌మేట్కక్లబ్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహారాజు వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు క్యారంబోర్డ్, చెస్‌బోర్డు, రింగ్ బాల్స్, స్కిప్పింగ్, వాలీబాల్ కిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, ఆర్థిక కార్యదర్శి కట్టా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అచ్చంపేటలో 59 మంది విద్యార్థులు గైర్హాజరు

అచ్చంపేటటౌన్, మార్చి 12: పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 938 మంది విద్యార్థులకు గానూ 59 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 879 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 149 మంది విద్యార్థులకు 138 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 168 మందికి గానూ 156, ప్రగతి జూనియర్ కళాశాలలో 194 మందికి గానూ 176, త్రివేణి జూనియర్ కళాశాలలో 238కి గాను 227 మంది, చైతన్య జూనియర్ కళాశాలలో 189 మంది విద్యార్థులకు గానూ 182 మంది హాజరయ్యారని చీఫ్‌సూపరింటెండెంట్లు వెంకటయ్య, జయమ్మ, శ్రీనివాస్ గౌడ్, రవి, మల్లయ్య తెలిపారు.

ఇద్దరు గైర్హాజరు..

తిమ్మాజిపేట, మార్చి 12 :మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహనాధికారి వెంకన్న తెలిపారు. మొత్తం 132 మందికి గాను 130 హాజరైనట్లు ఆయన తెలిపారు.

15న ఓటరు చైతన్యంపై మానవహారం

- **డీఈవో గోవిందరాజులు**

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 12 : స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 15వ తేదీన జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలో ఉదయం 10గంటలకు ఓటరు చైతన్యంపై మానవహారం నిర్వహించాలని డీఈవో గోవిందరాజులు మంగళవారం ప్రకటనలో తెలిపా రు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు శాతాన్ని పెంచడంకోసమే విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు.

14 నుంచి మంత్రాలమ్మ ఉత్సవాలు

జనుంపల్లి శివారులో ఉన్న మంత్రాలమ్మ ఆలయం

కోడేరు, మార్చి 12: మండలంలోని జనుంపల్లి గ్రామ శివారులో వెలసిన మంత్రాలమ్మ ఆలయంలో ఈనెల 14 నుంచి 24 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 15 రోజుల పాటు వైభవంగా కొనసాగనున్న ఉత్సవాలకు ఆలయ కమిటీ, గ్రామపంచాయతీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాల్లో ముఖ్య ఘట్టమైన సిడే ఉత్సవం నెల 14న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచే గాక కర్నూల్ జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛంద పునరావాస సమావేశం

అమ్రాబాద్, మార్చి 12: మండలంలోని కుడిచింతలబావి గ్రామంలో ఎన్టీసీఏ స్కీంలో భాగంగా గ్రామ ప్రత్యేకాధికారి ఎంపీవో వెంకటయ్య ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛంద పునరావాస సమావేశం నిర్వహించారు. గ్రామాల తరలింపులో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో దోమలపెంట ఎఫ్ఆర్వో గురుప్రసాద్ ఆధ్వర్యంలో 164 కుటుంబాల వారు దరఖాస్తు చేసుకోగా ఇందులో 8మంది పెండ్లైన ఆడబిడ్డలు ఉండగా ఒకరుమృతి చెందగా మరో ముగ్గురు 18 ఏండ్లు నిండని వారిగా గ్రామస్తులు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు వాసవి, భాగ్యమ్మ, ఎఫ్‌బీవోలు తేజశ్రీ, ముత్యాలు, పంచాయతీకార్యదర్శి సూర్య, పాల్గొన్నారు.

పకడ్బందీగా అమలు చేయాలి

- **పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచాలి**
- **కలెక్టర్ ఉదయ్‌కుమార్**
- **నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల అధికారులతో సమావేశం**

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మార్చి 12: కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల సంసిద్ధతపై నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల అదనపు కలెక్టర్లు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల విధులు సహాయ రిటర్నింగ్ అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేలా కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, అధికారుల విధులపై కలెక్టర్ వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతి అధికారి భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను చదవాలని సూచించారు. ఎన్నికల విధులు సక్రమంగా పూర్తి చేసేందుకు అధికారులు అవసరమైన సిబ్బందిని ముందుగానే ఎంపిక చేసుకొని వారికి సరైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అధికారులు పక్షపాతం లేకుండా పనిచేయాలని ఆదేశించారు. ఒక్కో సెక్టర్ పరిధిలో 9 పోలింగ్ కేంద్రాలకు మించి ఏర్పాటు చేయకూడదన్నారు. వారంరోజుల్లో తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి వివరాలను తెలియజేయాలన్నారు. ముఖ్యంగా ఆవాస ప్రాంతాల చెంచుల ఓటర్ల సమోదు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్నికల సమయంలో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లకు పోలీస్‌శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈవీఎంల తరలింపు, ఎన్నికల విధుల్లో పాల్గొనే సెక్టార్ అధికారులకు వాహనాల కేటాయింపు, పోలింగ్ సిబ్బందికి కావాల్సిన వాహనాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. జీపీఎస్ ట్రాకింగ్ మానిటరింగ్ వాహనాలు కూడా సిద్ధంగా ఉంచాలన్నారు. సార్వత్రిక ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం త్వరలోనే ప్రకటన చేయనుందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన వెంటనే పర్యవేక్షణ బృందాలు సర్వే లన్స్ ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ పర్యవేక్షణ బృందాలను సంసిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేలా స్వీప్ కార్యక్రమాలను విరివిగా నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేసే విధంగా ప్రతివారం పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, గద్వాల అదనపు కలెక్టర్ సంచిత్‌గాంగ్వార్, వనపర్తి అదనపు కలెక్టర్ నగేశ్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు జారీక్‌అలీ, కార్తీక్‌కుమార్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, అలంపూర్ ఆర్డీవోలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**

పార్లమెంట్ ఎన్నికలకు ఏ క్షణంలోనైనా షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నందున ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని, ఎన్నికల ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఎన్నికల నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావుతో కలిసి వీడియో కన్ఫరెన్స్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించిన దరఖాస్తు చేయించడం, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, మోడల్ పీఎస్‌ల ఏర్పాటు, మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్ల విషయంలో చేపట్టాల్సిన చర్యలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, వారికి శిక్షణ తరగతులు నిర్వహించడం, ఓటింగ్‌యంత్రాల ర్యాండమైజేషన్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షిస్తూ అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

సెక్టార్ అధికారుల బాధ్యత కీలకం

లోక్‌సభ ఎన్నికల విధుల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని మాస్టర్ ట్రైనర్, డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఎన్నికల సెక్టార్ అధికారులకు ఎన్నికల విధులు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, యంత్రాల బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

టీబీ నివారణకు కృషి చేయాలి

బిజినేపల్లి, మార్చి 12: టీబీ నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ మాధురి అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం ప్రభుత్వ దవాఖానలో టీబీ ముక్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు వారాలకు మించి దగ్గు, తెమడ, బరువుతగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే దవాఖానలో తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీరయ్య, బాలీశ్వర్, గోవర్ధన్, జగవర్ధనమ్మ పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

వెల్దండ మార్చి 12 : మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన అల్వాల సలేశ్వరం గౌడ్(35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి సలేశ్వరం గౌడ్ చారకొండలో కేబుల్‌నెట్‌వర్క్‌షాపు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఎర్రవల్లికి వచ్చిన సలేశ్వరంగౌడ్ తన వ్యవసాయం పొలంలోకి వెళ్లి చెట్టుకు పాతచీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు అక్కడికి వెళ్లిచూడగా అప్పటికే మృతి చెందిఉన్నాడు. మృతుడికి భార్య రేణుకా, ఇద్దరు పిల్లలున్నారు. అప్పులబాధతో ఆర్థిక భారం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఎసై రవి ఘటన స్థలానికి వెళ్లి పంచనామ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి

లచ్చలమ్మ (ఫైల్)

వంగూరు, మార్చి 12 : మండలంలోని గాజర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, రైతుబంధు మండల కన్వీనర్ నారాయణ్‌రావు మాతృమూర్తి లచ్చలమ్మ (103) మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. శతాధిక వృద్ధురాలైన లచ్చలమ్మ మృతి చెందడంతో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్దెత్తునా హాజరై ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజేందర్‌రెడ్డి, గణేశ్‌రావు, నరేందర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యులు హమీద్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకే టాలెంట్ టెస్ట్

కొల్లాపూర్, మార్చి 12: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయడంతో పాటు పరీక్షల భయం పోగొట్టడానికే టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు శివవర్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు మాడల్‌టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మమ్మ, రమాదేవి, నరేశ్, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు భైరవ శి వ, చందు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మల్లన్న కల్యాణోత్సవం

మల్లన్న స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

- **హాజరైన ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి**

నాగర్‌కర్నూల్, మార్చి 12: మండలంలోని కుమ్మెర గ్రామం గట్టుపై వెలసిన మల్లన్నస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణోత్సవ వేడుకను వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారి కల్యాణ వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఉత్సవాల నాటికి ఆలయానికి రోడ్డు, నీటి ట్యాంకు, మెట్ల సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోటయ్య, రమణారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో భజన పోటీలు

బిజినేపల్లి, మార్చి 12: మండల కేంద్రంలోని ఆనందగిరి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉమ్మడి పాలమూరు జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిది బృందాలు పాల్గొని భక్తి కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. గెలుపొందిన భజన బృందాలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతయ్య, నిరంజన్, వెంకన్న పాల్గొన్నారు.

ముగిసిన ఈదమ్మ ఉత్సవాలు

కొల్లాపూర్, మార్చి 12: పట్టణ శివారులో కొలువైన ఈదమ్మదేవి ఉత్సవాలు మంగళవారం నెల పూజలతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదు మంగళవారాలు భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఏలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 12 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌శర్మ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్ బోధిం చేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పీజీలో కనీసం 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి పీహెచ్‌డీ లేదా ఎన్ఈటీ, ఎస్ఈటీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా బోధన అనుభవం గల వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జిరాక్స్ అటెస్టెడ్ సర్టిఫికెట్లతో 15వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా మహిళా సాధికారికత దినోత్సవం

పీజీ కాలేజీలో మహిళా సిబ్బందిని శాలువాలతో సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

కొల్లాపూర్, మార్చి 12: పట్టణంలోని పీజీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారికత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ డాక్టర్ మార్క్ పోలోనియస్ మహిళల గొప్పతనాన్ని, వారు సాధించిన ఘనతను వివరించారు. అనంతరం కళాశాలలోని మహిళ సిబ్బందిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.సంతోశ్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలు

ఉత్సవాలకు ముస్తాబైన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం

అమ్రాబాద్, మార్చి 12: పదర మండలం రాయలగండి లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం యాగశాల ప్రవేశం , స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. అలాగే గురువారం రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్, డివిజన్‌స్థాయి కోలాటం, భజన పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావం దినోత్సవం

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 12 : జిల్లా కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి గీత జెండా ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఈశ్వరమ్మ, లింగమ్మ ఉన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్యసేవలు

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 12 : మున్సిపల్ పరిధిలోని నాగనూల్‌లో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సంచార వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ నాగనూల్‌లో 78మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ యూత్ జిల్లా కన్వీనర్ కుమార్, పర్యవేక్షణాధికారి కేశవులు, ఏఎన్ఎం కవిత పాల్గొన్నారు.

వడ్డెర సంఘం గ్రామకమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి, మార్చి 12: మండలంలోని దేవునితిర్మలాపూర్‌లో మంగళవారం వడ్డెర సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగేశ్వర్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా శివరాజు, కోశాధికారిగా ఎల్లయ్య, సలహాదారులుగా నిరంజన్, కుర్మయ్య, వెంకటస్వామి, బాలస్వామి, ఆంజనేయులులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- **ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి**

నాగర్‌కర్నూల్, మార్చి 12: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుటధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, కోశాధికారి అశోక్, పంచాయతీ వర్కర్స్ జిల్లాఅధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి

అచ్చంపేటరూరల్, మార్చి 12: రెండు నెలల బకాయి వేతనాలను చెల్లించాలంటూ మున్సిపల్ కార్మికులు మంగళవారం కార్యాలయం ఆవరణలో ఆందోళన నిర్వహించారు. వీరికి సీఐటీయూ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లేశ్ మాట్లాడుతూ .. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

తైబజార్ వేలం

అచ్చంపేటటౌన్, మార్చి 12: మంగళవారం తైబజార్ వేలం నిర్వహించారు. వేలంలో ఆంజనేయులు రూ.10,05, 000లతో దక్కించుకున్నారు. అలాగే పశువులు, మేకల, గొర్రెల సంతకు వేలం నిర్వహించగా రూ.33,63,000లకు మధుకర్‌రెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ నర్సింహాగౌడ్, కమిషనర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

- **మంత్రి పొన్నంకు వినతి**

అచ్చంపేటరూరల్, మార్చి 12: రాష్ట్రంలో మేరు కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంగళవారం సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు.